విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 23, ఆగస్టు 2024

29న విద్యార్థుల సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా రిలే నిరాహార దీక్షలు

- ప్రభుత్వ వసతి గృహ విద్యార్థుల బకాయి చార్జీలు విడుదల చేయాలి
- శిథిలావస్థకు చేరిన వాటిస్థానంలో నూతన భవనాలు నిర్మించాలి
- అర్థాంతరంగా నిలిచిన గురుకుల పాఠశాల నిర్మాణం వెంటనే పూర్తి చేయాలి
- రాష్ట్రవ్యాప్త కలెక్టరేట్ కార్యాలయాల వద్ద రిలే నిరాహార దీక్షలు జయప్రదం చేయండి
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జన్సన్‌బాబు

అనంతపురం బ్యూరో–విశాలాంధ్ర : ప్రభుత్వ బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ గురుకుల కేజీబీవి హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్‌బాబు పిలుపునిచ్చారు.గురువారం జిల్లా సీపీఐ కార్యాలయంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణయ్య కుళాయిస్వామిలతో కలసి వి.జాన్సన్ బాబు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 29 జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు చేపట్టిపోతున్నట్లు వారు తెలిపారు. ప్రభుత్వ హాస్టల్ నెలకొన్న విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు గత ఎనిమిది నెలల నుంచి మెస్ చార్జీలు కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయలేదని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం మెస్ చార్జీలు కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పాతబడిన ప్రభుత్వ హాస్టల్ భవనాలకు నూతన భవనాలు నిర్మించాలని లేకపోతే వాటి మరమ్మతుల కోసం తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ హాస్టల్స్ లో ఖాళీగా ఉన్న వార్డెన్ కుక్ అటెండర్ కామాటి పోస్టులు భర్తీ చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ మహిళ వసతి గృహాలలో సంఖ్యకు మించి అధనంగా విద్యార్థులు ఉంటున్నారనీ ఆయా ప్రాంతాల్లో విద్యార్థులకు ఉన్న డిమాండ్ సంఖ్యను దృష్టిలో పెట్టుకొని నూతన భవనాలు నిర్మించాలన్నారు.ప్రస్తుతం నిర్వహిస్తున్న హాస్టల్స్‌లో పక్కనే హాస్టల్ ప్రభుత్వ స్థలం ఉన్న వాటికి అక్కడ నిర్మాణం చేపట్టాలన్నారు. అలా భవన్ నిర్వహిస్తే విద్యార్థుల సమస్య పరిష్కారం అవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో రాయదుర్గం నియోజకవర్గంలో గోనబావి కళ్యాణ్ దుర్గం నియోజకవర్గంలోని కుందుర్పి ముద్దినేనిపల్లి ప్రాంతాలలో గత 7 8 సంవత్సరాల క్రితం గురుకుల పాఠశాలల ప్రభుత్వం నుంచి మంజూరు అయినప్పటికీ వాటి నిర్మాణాన్ని చేపట్టి అర్థాంతరంగా మధ్యలోనే వదిలేసారన్నారు. ఆ మూడు ప్రాంతాలలో గురుకుల పాఠశాలలో నిర్మాణం పూర్తయితే కొన్ని వేల మంది విద్యార్థులకు విద్యను అందించే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థలు దీటుగా విద్యనందిస్తున్న గురుకుల పాఠశాల ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ ఇంతవరకు నిర్మాణం చేపట్టకుండా ఎందుకు నిర్లక్ష్యం వహించారని వాటి నిర్మాణానికి నిధులు లేకపోతే తక్షణమే రాష్ట్ర ప్రభుత్వంతో గాని జిల్లా కలెక్టర్ గారితో గాని ఆ శాఖ బాధ్యులు మాట్లాడి వాటి నిర్మాణాన్ని పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు .గత టిడిపి ప్రభుత్వ హాయంలో ఉన్న మధ్యాహ్న భోజన పథకం వల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగిందని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం రద్దు చేయడంతో చాలామంది పల్లెటూరు ప్రాంత విద్యార్థులు కళాశాలలకు రావడానికి మొగ్గు చూపడం లేదన్నారు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం కొనసాగించి విద్యార్థుల ఆకలి తీర్చి విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలన్నారు అదేవిధంగా జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న బోధన బోధ నేతల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు ఈ సమస్యల పరిష్కారం కోసం అనంతపురం జిల్లాలోని కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఈనెల 29వ తేదీన రిలే నిరాహార దీక్షలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి హనుమంతు జిల్లా ఆఫీస్ బేరర్స్ వెంకట్ నాయక్ ఆంజనేయులు వంశీ జిల్లా కార్యవర్గ సభ్యులు మంజునాథ్ ఉమా మహేష్ చందు వినోద్ నవీన్ హరుణ్ రషీద్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి-సీపీఐ మండల కార్యదర్శి గంగాధర్

విశాలాంధ్ర–శింగనమల: నార్పల మండల కేంద్రంలో పంచాయతి కార్యాలయం ముందర మెయిన్ రోడ్‌లో సీపీఐ మండల కార్య దర్శి గంగాధర్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు తాగునీటి సమస్యను పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దే శించి సీపీఐ మండల కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ నార్పల మండల కేంద్రంలో అన్నికాలనీల్లో తాగునీటి ఎద్దడి చాలా తీవ్రం గా ఉన్నదని పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన సమస్యను పరిష్కరించలేదని బుధవారం పలు కాలనీల మహిళలతో కలిసి రోడ్డుపై రాయించడం జరిగిందన్నారు. నార్పల పంచాయతీ సెక్రటరీ అందుబాటులో లేకపోవడంతో నార్పల ఎంపీడీ వో దివాకర్ నిరసన తెలుపుతున్న వారి దగ్గరికి వెళ్లి సమస్యను త్వరలోనే రెండు మూడు రోజుల్లో పరిష్కరిస్తామని నార్పల మండల కేంద్రంలోని ఏ కాలనీకి తాగునీటి ఎద్దడి రానివ్వమని ఎంపీడీవో సీపీఐ నాయకులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శి చాపల రామంజి, సిపిఐ సీనియర్ నాయకుడు సుధాకర్.వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పెద్దపెద్దయ్య, పలు కాలనీవాసులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర–అనంతపురం: ఎస్.కెయు రూట్ ఆటో డ్రైవర్ల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపప్రధాన కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ వైజాగ్‌స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని అసంఘటిత రంగ కార్మికులకు పీఎఫ్ ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కాంట్రాక్ట్ వ్యవస్థలో పనిచేస్తున్న కార్మికులందరినీ రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఫైన్ల భారం మోయలేక ఇబ్బంది పడుతున్న రవాణా రంగంపై ఉన్న జీవో నెంబర్ 21న రద్దు చేయాలని అధిక వడ్డీలు వసూలు చేస్తున్న ఫైనాన్స్‌లపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్కేయూ రూట్ నాయకులు గంగా ప్రసాద్, హరికృష్ణ ఆదినారాయణ చంద్ర భాష రమణ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

వివాహాలకు హాజరైన ఆర్థిక మంత్రి పయ్యావుల

విశాలాంధ్ర–కూడేరు: ఉరవ కొండ నియోజకవర్గం కూడేరు మండలం నందు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ వివాహ శుభ కార్యాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కూడేరులోని శ్రీ సంగమేశ్వర జోడి లింగాల ఆలయము నందు కదిరెప్ప గారి క్రిష్టప్ప కుమారుడు వివాహం, కదిరప్ప గారి పుల్లన్న కుమారుడు వివాహాలకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను అశ్విరదించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, శ్రీధర్ చౌదరి, మాజీ జెడ్పిటిసి రామచంద్ర, మాజీ ఎంపీపీ బ్రహ్మయ్య, కూడేరు మండల వ్యాప్తంగా పార్టీ కుటుంబ సభ్యులు వివాహ శుభ కార్యమునందు హాజరై పెద్ద ఎత్తున పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన అధనపు ఎస్పీ

విశాలాంధ్ర–అనంతపురం: జిల్లా ఎస్పీ పి.జగదీష్‌ని అధనపు ఎస్పీడి.వి. రమణమూర్తి (అడ్మిన్) గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. సాధారణ బదిలలో భాగంగా డి.వి.రమణమూర్తి ఇక్కడికి అధనపుఎస్పీ అడ్మిన్‌గా బదిలీపై వచ్చిన విషయం విదితమే. బుధవారం రాత్రి బాధ్యతలు స్వీకరించిన అధనపు ఎస్పీఅడ్మిన్ పుష్పగుచ్ఛం అందజేసి ఎస్పీకి శుభాకాంక్షలు తెలిపారు.

రైతు సమస్యలపై నిరంతరం పోరాటం నిర్వహిస్తాం

విశాలాంధ్ర–శింగనమల: మండల రైతు సంఘం నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా శ్రీనివాసులు కొండారెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల వ్యాప్తంగా ఉన్న రైతు సమస్యలపై నిరంతరం పోరాటం నిర్వహిస్తామని తెలిపారు. తమను రైతుసంఘం అధ్యక్ష,కార్యదర్శులుగా ఎంపిక చేసిన రైతు సంఘం జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఉరవకొండలో గ్రామసభ

విశాలాంధ్ర–ఉరవకొండ: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరంలో అమలు చేయనున్న పనులపై నేడు శుక్రవారం ఉరవకొండ మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామసభ నిర్వహిస్తున్నట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి గౌస్ సాహెబ్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం మంజూరు చేయబడిన పురోగతిలో ఉన్న పనుల వివరాలను ఈ సభలలో చదివి వినిపించడం జరుగుతుందన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి అనేక అంశాలను ఈ సభలో చర్చించడం జరుగుతుందన్నారు.

భారీ వర్షాలకు తెగిపోయిన ముద్దినాయనపల్లి చెరువు

విశాలాంధ్ర–కళ్యాణదుర్గం: భారీ వర్షాలకు కళ్యాణదుర్గం మండలం ముద్ది నాయన పల్లి చెరువు పూర్తిగా తెగిపోయింది. ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బుధవారం చెరువుకు గండి పడగా సకాలంలో ఇరిగేషన్ అధికారులు స్పందించకపోవడంతో రాత్రి పొద్దు పోయాక పూర్తిస్థాయిలో తెగిపోయినట్లు రైతులు తెలిపారు. ముద్దినాయనపల్లి చెరువు 1996, 2002-06 వరుసగా మూడు దపాలుగా పూర్తిగా తెగిపోయింది. నిర్మాణ సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో కష్టాలు ఎదురవుతున్నాయని, భారీ వర్షాలొస్తే ఒకే చోట తగ్గిపోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. గుత్తేదారులు, ఇంజనీర్లకు కాసుల వర్షం కురిపిస్తున్న చెరువు మరమ్మతులు శాశ్విత పరిష్కారం చూపాలని పలువురు రైతులు కోరుతున్నారు.

దుర్గం మున్సిపల్ కమిషనర్‌గా దివాకర్ రెడ్డి నియామకం

విశాలాంధ్ర–రాయదుర్గం: రాయదుర్గం పురపాలక శాఖ మున్సిపల్ కమిషనర్ గా వి,దివాకర్ రెడ్డి నియమించిన రాష్ట్ర ప్రభుత్వం. ఇక్కడ మున్సిపల్ కమిషనర్ గా పనిచేస్తున్న పి.కిషోర్‌ను కడప మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ గా బదిలీ చేసింది. దివాకర్ రెడ్డి గతంలో కూడా రాయదుర్గం మున్సిపల్ కమిషనర్ గా విధులు నిర్వహించారు.

జాయింట్ కలెక్టర్‌గా శివ్ నారాయణ్‌శర్మ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర–అనంతపురం: అనంతపురం జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా శివ్ నారాయణ్‌శర్మ బాధ్యతలను స్వీకరించారు. ముందుగా బుధవారం నగరంలోని జాయింట్ కలెక్టర్ క్యాంప్ కార్యాలయం చేరుకున్న ఆయనకు ఇంచార్జి జాయింట్ కలెక్టర్ మరియు డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, సివిల్ సప్లై డిఎం రమేష్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ జి.మారుతి, తహసిల్దార్ హరిప్రసాద్, తదితరులు పుష్పగుచ్ఛాలు, పూల మొక్కలు అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డా.వినోద్ కుమార్‌ని శివ్‌నారాయణ్‌శర్మ మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు.జాయింట్ కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఇంచార్జి జాయింట్ కలెక్టర్ మరియు డిఆర్ఓ నుంచి జాయింట్ కలెక్టర్ గా శివ్ నారాయణ్ శర్మ బాధ్యతలను స్వీకరించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, మధురకి చెందిన జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ 2021 ఐ.ఏ.ఎస్ బ్యాచ్ కు చెందిన వారు. ఐ.ఏ.ఎస్ కు ఎంపికైన అనంతరం ఆయన గుంటూరు జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్ గా పనిచేశారు. అనంతరం 2023 డిసెంబర్ 21 నుంచి కర్నూలు జిల్లా ఆదోని సబ్ కలెక్టర్ గా పనిచేస్తూ పదోన్నతి పొంది జిల్లా జాయింట్ కలెక్టర్ గా నియమితులయ్యారు. బుధవారం రాత్రి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించడం జరిగింది. ఈసందర్భంగా రెవిన్యూ సర్వీసెస్ అసోసి యేషన్ ప్రెసిడెంట్ కుల్లాయప్ప, సెక్రెటరీ దివాకర్, డిప్యూటీ తహసీల్దార్లు చాంద్‌బాష, షేక్షావలి, సంజీవరాయుడు, జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయం సిబ్బంది, తదితరులు పుష్పగుచ్ఛాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కార్మికులను వేధిస్తున్న సర్పంచ్ కార్యదర్శిపై చర్యలు తీసుకోండి



విశాలాంధ్ర–తాడిపత్రి: స్థా నికమండల కార్యాలయం లో గురువారం కోమలి గ్రామ పంచాయతీలో నివ సించే సుంకర నాగేంద్ర తండ్రి లేట్. పెద్ద నాగ మణి, కోమలి గ్రామ ప్రజ లతో కలసి కోమలి గ్రామ సర్పంచ్ కే. ఈశ్వరమ్మ, పంచాయతీ సెక్రెటరీ ప్రతాప్‌రాజు పారిశుద్ధ్య కార్మి కులను వేధిస్తున్నారని ఎంపీడీవో రంగారావు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడు తూ కోమలి గ్రామంలో స్వచ్ఛభారత్ కింద క్లీనింగ్ చేయడం లేదు. పారిశుద్ధ్య కార్మికులు గ్రామంలో క్లీన్ అండ్ గ్రీన్ పనులు చేస్తుంటే నేనేమైనా మీకు చేయమని చెప్పానని, నేను చెప్పంది. మీరు పనులు చేస్తే మీకు జీతాలు పెట్టను అని బెదిరించడమే కా కుండా గత నెలలలో రావాల్సిన జీతాలకు సంతకాలు పెట్టనని సర్పంచ్ చెప్తున్నారని వారు వాపోయారు. ఇదే విషయాన్ని పంచాయతీ కార్యదర్శి ప్రతాప్ రాజు దృష్టికి తీసుకుపోతే నాదేముంది సర్పంచ్ ఏం చెప్తే అది నేను కళ్ళు మూసుకొని సంతకాలు పెడతాను నాకు మీరు ఎంత చెప్పినా వృథాప్రాయాసే సర్పంచ్ కాళ్ళో, చేతులో పట్టుకొని బతిమిలాడికోపోండని పంచాయతీ కార్యదర్శి ప్రతాప్ రాజు సర్పంచ్ కే.ఈశ్వరమ్మకి వతాస్ పలుకు తున్నాడు.ఈ విషయాలన్నీ కూడా మా గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల దృష్టికి తీసుకుపోయామన్నారు. రాబోయే రోజుల్లో గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం ప్రభుత్వం కేటాయించే నిధులను కూడ స్వాహా చేసే ప్రమాదం ఉంది. పంచాయతీ నిధులు సర్పంచ్ స్వాహా చేయడానికి ప్రతాప్ రాజు కూడా సహాయ సహకారాలు అందిస్తాడని మాకు అనుమానం ఉన్నది. మా యొక్క ఫిర్యాదును పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కోరారు.

కేరళ వరద బాధితులకు హమాలీల చేయూత

విశాలాంధ్ర–అనంతపురం: కేరళలోని వాయనాడు వరద బాధితులను ఆదుకోవాలని హమాలి వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక పాతూరులో మాస్ క్యాంపెనింగ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎస్. రాజేష్‌గౌడ్, హమాలి యూనియన్ జిల్లా కార్యదర్శి వికే కృష్ణుడు, ఏఐటీయూసీ నగర అధ్యక్షులు జి.చిరంజీవి, హమాలి యూనియన్ జిల్లా అధ్యక్షులు అక్బర్ వలి,కొత్తూరు హమాలి యూనియన్ కార్యదర్శి నారాయణ, బాబు, ధనుంజయ రాము తదితరులు పాల్గొనడం జరిగింది.

అభివృద్ధి పనులపై అలసత్వం ఉండరాదు-జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర–అనంతపురం: నగరపాలక సంస్థలో అభివృద్ధి పనులు అత్యంత వేగంగా చేపట్టాలని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఆదేశించారు. గురువారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్.సి.ఏ.పి) కార్యక్రమం కింద జిల్లా స్థాయి కమిటీ సమీక్ష సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్.సి.ఏ.పి కార్యక్రమం కింద 2020-21 నుంచి 2023-24 వరకు 11 కోట్ల 4 లక్షల రూపాయలు మంజూరు కావడం జరిగిందని, అందులో ఇప్పటివరకు 3.5 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు పెట్టడం జరిగిందన్నారు. మిగిలిన 7.79 కోట్ల రూపాయల నిధులు అందుబాటులో ఉన్నాయని, నగరంలో పచ్చదనం పెంపొందించడం, రోడ్ల అభివృద్ధి, లాంటి అభివృద్ధి పనులను చేపట్టాలని, అభివృద్ధి పనులు చేపట్టడంలో అలసత్వం ఉండరాదన్నారు. నగరపాలక సంస్థ అధికారులు నిధులు అందుబాటులో ఉన్న పనులు చేయకపోవడం తగదని, ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు యాక్టివ్ గా ఉంటూ పనులు చేపట్టాలని, పనులపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించారు. ఎన్.సి.ఏ.పి కార్యక్రమం కింద 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి 4 కోట్ల 48 లక్షల రూపాయలు మంజూరు కావడం జరిగిందని, అయితే ఇంతకుముందు విడుదలైన నిధులు 75 శాతం పూర్తయితే ఇప్పుడు మంజూరైన నిధులు విడుదలవుతాయన్నారు. ఎలాంటి నిర్లక్ష్యానికి చోటు ఇవ్వకుండా నగరంలో అభివృద్ధి పనులు చేపట్టడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నగరంలో ఉన్న జనాభాకు అనుగుణంగా రోడ్లు, పార్కింగ్, డ్రైనేజీలు, వంకల్లో చెత్త తొలగింపు, తదితర పనులు సరిగా లేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని, అభివృద్ధి పనులు త్వరితగతిన చేపట్టాల్సిన అవసరముందన్నారు. అభివృద్ధి పనులకు ప్రభుత్వ నిబంధనలు అమలు చేస్తూ టెండర్లు పిలవడం, పనులు మొదలుపెట్టి పూర్తి చేయడం, లాంటి అన్ని రకాల పనులు వేగవంతంగా చేపట్టాలన్నారు. వెంటనే అభివృద్ధి పనులను మొదలుపెట్టి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ కార్యక్రమం కింద జిల్లా స్థాయి కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించాలని, ఇందుకోసం షెడ్యూల్ చేయాలన్నారు. ఈ సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ కిషోర్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ పీవీఎస్ఎన్.మూర్తి, డిటిసి వీర్రాజు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, పరిశ్రమల శాఖ ఏడి రాజశేఖర్ రెడ్డి, నగరపాలక సంస్థ ఈఈ సూర్యనారాయణ, డిప్యూటీఈఈ సుభాష్ చంద్రబోస్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి- జిల్లా మలేరియా అధికారి ఓబులు

విశాలాంధ్ర–అనంతపురం: జిల్లాలో వారం రోజుల నుండి వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా దోమలు అధికంగా వృద్ధి అయ్యే అవకాశముంది. ప్రజలు సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, చికున్ గున్యా వంటి జబ్బులకు గురి కాకుండా తమ ఇంటిలోని నీటి వనరుల్లో లార్వా లేకుండా చూసుకోవాలని, ఇంటి చుట్టూ పరిసరాల్లో పనికిరాని ప్లాస్టిక్ వస్తువులు పాత టైర్లు, డబ్బాలు,కొబ్బరి బొండాలు, తాగి పడవేసిన గ్లాసులు, వస్తువులు, పిచ్చి మొక్కలు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మలేరియా అధికారి కక్కలపల్లి కాలనీ పంచాయతీ పరిధిలోని నందమూరి నగర్ నందు పర్యటించారు. అక్కడ ఇంటింట లార్వే సర్వేలో లార్వా కనిపించిన నీటి వనరుల నుండి లార్వాను తొలగింపచేయాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. జ్వరాలతో బాధపడే వారి నుండి రక్త పరీక్షలు సేకరించి ల్యాబ్ కు పంపించాలని సిబ్బంది నీ ఆదేశించారు . మురుగు నీటి కాలువలలో ఎలాంటి ప్లాస్టిక్ వస్తువులు, చెత్తాచెదారం లేకుండా సక్రమంగా పారేటట్లు చూడాలని, లార్వా నిర్మూలనకు ఉపయోగించే అబేట్ మందును పిచికారి చేయించాలని పంచాయతీ వర్కర్స్ ను ఆదేశించారు. జ్వరాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టి ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సూపర్వైజర్ నూరు భాష, కురుగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణ అధికారి రవీంద్రారెడ్డి, సూపర్వైజర్ లక్ష్మన్న, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎం మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

శింగనమల సీఐగా కౌలుట్లయ్య

విశాలాంధ్ర–శింగనమల: శింగనమల సీఐగా కౌలుట్లయ్య బాధ్యతలు గురువారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు సీఐడీ విభాగం నుండి శింగనమల సర్కిల్‌కు నూతన సీఐగా కౌలుట్లయ్య బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ శ్రీధర్ బుక్కరాయ సముద్రం సర్కిల్‌కు బదిలీపై వెళ్లారు. శింగనమల పోలీస్ స్టేషన్‌లో నూతన సీఐ కౌలుట్లయ్యకు, బుక్కరాయ సముద్రం సీఐ శ్రీధర్, నార్పల ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి, ఏఎస్ఐ చిదంబరయ్య, పోలీస్ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో, పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు.

కౌన్సిలర్ చొరవతో పరిసరాల పరిశుభ్రం

విశాలాంధ్ర–తాడిపత్రి : పట్టణంలోని 30వ వార్డ్, భగత్ సింగ్ నగర్లో గత కొన్ని రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వార్డులో నీరు నిల్వ చేరి దోమలు ఎక్కువ అవుతున్నాయని కాలనీ ప్రజలు కౌన్సిలర్ మల్లికార్జునకు సమస్యను తెలియజేశారు. దీంతో కౌన్సిలర్ మల్లికార్జున పారిశుద్ధ్య అధికారికి ఫిర్యాదు చేసి కాలనీలో కౌన్సిలర్ మల్లికార్జున చొరవ తీసుకొని పారిశుద్ధ కార్మికుల చేత నీటి నిల్వ ఉన్నచోట దోమల మందు పిచికారి చేసి, బ్లీచింగ్ పౌడర్ తదితర దోమల నివారణ చర్యలు చేపట్టారు.

వైద్య విద్యార్థి అత్యాచార సంఘటనపై మానవహారంతో నిరసనలు

విశాలాంధ్ర–గుత్తి: కలకత్తాలో ఈనెల 9న జరిగిన వైద్య విద్యార్థిని అత్యాచార సంఘటనపై నిరసనలు చేపట్టారు. అనంతరం గుత్తి వర్కింగ్ జర్నలిస్ట్ నేతృత్వంలో గురువారం గుత్తి జేఏసీ ఆధ్వర్యంలో వివిధ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రైవేటు,ప్రభుత్వ వైద్య సిబ్బంది,ప్రజా సంఘాల నాయకులు,వివిధ రాజకీయ పార్టీ నాయకులు,లాయర్లు నల్ల బ్యాడ్జీలతో నిరసన ర్యాలీ చేపట్టారు.ఈ ర్యాలీ గాంధీ విగ్రహం కూడలి నుండి పట్టణంలోని పురవీధుల గుండా ఎన్టీఆర్ విగ్రహం కూడలి మీదుగా రాజీవ్ విగ్రహం వరకు అనంతరం రాజీవ్ గాంధీ విగ్రహం కూడలి మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు.ఈ సందర్భంగా గుత్తి జేఏసీ నాయకులు మాట్లాడుతూ కలకత్తాలో వైద్యురాలిపై హత్య చేసిన వారిని తక్షణమే శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు మరోసారి పునరుద్ధం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైద్యురాలిపై ఈ దుర్మార్గానికి పాల్పడిన నిందితుడికి ఉరిశిక్ష వేయాలని, అలాగే,బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్టులు,జేఏసీ నాయకులు, ప్రైవేటు, ప్రభుత్వ వైద్య సిబ్బంది,లాయర్లు,ప్రజా సంఘాల నాయకులు, స్వచ్ఛంద సేవా సంస్థలు వివిధ రాజకీయ పార్టీ నాయకులు,వివిధ కళాశాలల విద్యార్థులు, ఉపాధ్యా యులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

విశాలాంధ్ర–కళ్యాణదుర్గం: కంబదూరు మండలం అండేపల్లిలో దళిత రైతు వన్నూరు స్వామి విద్యుదాఘాతంతో మృతి చెందారు.తన వ్యవసాయ పొలంలో మోటారుపెట్టడానికి వెళ్లిన రైతుకు విద్యుదాఘాతానికి గురయ్యారు.నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు విద్యుత్ లైన్లు ఎక్కడికక్కడ కింద పడుతున్నాయి వన్నూరు స్వామి పొలంలో కూడా స్టార్టర్ పెట్టకు విద్యుత్ తీగ తగిలి షాక్ కొట్టినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బుధవారం సాయంత్రం పొలంలోకి వెళ్లిన వన్నూరుస్వామి చీకటి పడిన తర్వాత కూడా ఇంటికి రాకపోవడంతో తోటలోకి వెళ్లి చూసిన కుటుంబ సభ్యులకు విగతజీవిగా పడిన రైతు కనబడ్డాడు. ఒక్కసారిగా కన్నీరు మున్నీరయ్యారు. దళిత రైతుకుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. వన్నూరుస్వామికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఐదెకరాల పొలంలో పంటలు సాగు చేసి కుటుంబాన్ని పోషిస్తున్న పెద్దదిక్కు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు అనాధగా మిగిలారు.

హత్యా నిందితులను కఠినంగా శిక్షించాలి



విశాలాంధ్ర–పుట్లూరు: సత్య సాయి జిల్లా హిందూపురం మండలం మణుగూరు గ్రామ పొలిమేరలో జయమ్మ(56) అనే గొర్రెల కాపరిని దొంగలు దారుణంగా హత్య చేసి ఆ కుటుంబ జీవనాధారమైన 14 మేకలను అపహరించుకొని పోయిన సంఘటనలో హత్య చేసిన హంతకులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు సి. లింగమయ్య, గొర్రెల మేకల పెంపకం దార్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి పోతులయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అనంతపురం సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆ కుటుంబ జీవనాధారమైన గొర్రెల కాపరుల వృత్తిలో జీవిస్తున్న పేద మహిళపై జరిగిన ఈ సంఘటన పట్ల ప్రభుత్వము పోలీసులు తక్షణమే స్పందించి బాధితురాలికి 15 లక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని, హంతకులు అపహరించిన 14 మేకలను కూడా రికవరీ చేసి బాధితురాలి కుటుంబ సభ్యులకి అందజేయాలని, ఇలాంటి సంఘటనలు మరలా జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమాఖ్య జిల్లా కార్యదర్శి సివి హరి కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు సి. నాగప్ప, చేతి వృత్తిదారుల సమాఖ్య నగర అధ్యక్షులు గోవిందరాజులు పాల్గొన్నారు.

సమ్మెలోని కార్మికులకు జీతాలు చెల్లించి తాగునీటి సరఫరా పునరుద్ధరించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్

విశాలాంధ్ర-బ్యూరో శ్రీసత్యసాయి: సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులకు తక్షణమే పెండింగ్ జీతాలను చెల్లించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. తమకు రావాల్సిన బకాయి జీతాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా సుమారు 600 మంది సత్యసాయి కార్మికులు గురువారం అర్ధరాత్రి నుంచి విధులకు హాజరుకాకుండా సమ్మెబాట పట్టిన విషయంపై సీపీఐ నాయకులు స్పందించారు. ఈ సందర్భంగా జిల్లా సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ గురువారం విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వాలు చేసిన పొరపాట్ల కారణంగా సత్యసాయి కార్మికులకు గత కొన్నేళ్ల నుంచి తరచూ నెలల తరబడి జీతాలు చెల్లింపులో జాప్యం ఏర్పడుతున్నాడంతో వారు తీవ్రఆర్థిక ఇబ్బందులు గురవుతున్నారు. ఇదిలా ఉండగా జీతాలు చెల్లించకపోవడమే గాక ఉద్యోగ పరంగా వారికి వర్తింపజేయాల్సిన ఈఎస్ఐ ఈపీఎఫ్ తదితర పథకాలు కూడా మంజూరు చేయకపోవడంతో వారు మరింత నష్టాలకు గురవుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో తమ జీతాలు చెల్లించాలని నెలల తరబడి అడుగుతున్నా సంబంధితఅధికారులు ప్రజాప్రతినిధులు ఏ మాత్రం పట్టించుకో కపోవడంతో గత్యంతరం లేనిస్థితిలో సత్యసాయి కార్మికులు గురువారం నుంచి సమ్మెబాట పట్టడంతో తాగునీటి సరఫరా జరగలేదని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో రెండు వారాల నుంచి నీటి సరఫరా కాలేదన్నారు. కాగా ఈ కార్మికుల సమ్మెతో పూర్తిగా జిల్లా వ్యాప్తంగా నీటి సరఫరా నిలిచిపోయే అవకాశముందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సత్యసాయి కార్మికులకు బకాయిపడ్డ ఏడు నెలల జీతాలను ప్రస్తుత ఎన్డిఏ ప్రభుత్వం తక్షణమే చెల్లించి తాగు నీటి సరఫరాకు ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు వేమయ్య యాదవ్ ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

లేని పక్షంలో సత్యసాయి కార్మికులతో కలిసి పెద్దఎత్తున సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో కార్యక్రమం చేపడతామని ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ తెలియజేశారు.

సమ్మెలోని కార్మికులకు జీతాలు చెల్లించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలి

సీపీఐ నాయకులు చల్ల శ్రీనివాసులు

విశాలాంధ్ర-ముదిగుబ్బ: సత్యసాయి నీటి సరఫరా కార్మికులకు తక్షణమే పెండింగ్ జీతాలను చెల్లించి మండలంలో తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని సీపీఐ మండల కార్య దర్శి చల్లా శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. తమకు రావలసిన సుమారు ఏడు నెలల జీతాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండ లంలో పనిచేస్తున్న 25మంది కార్మికులతో పాటు జిల్లా వ్యా ప్తంగా ఉన్న సుమారు 600మంది సత్యసాయి కార్మికులు గురువారం అర్ధరాత్రి నుంచి విధులకు హాజరుకాకుండా సమ్మెబాట పట్టిన విషయంపై సీపీఐ నాయకులుస్పందించారు. ఈ సందర్భంగా ఆపార్టీ మండల కార్యదర్శి చల్ల శ్రీనివాసులు గురువారం విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వాలు చేసిన పొరపాట్ల కారణంగా సత్యసాయి కార్మికులకు కొన్నేళ్ల నుంచి తరచూ నెలల తరబడి జీతాలు చెల్లింపులో జాప్యం ఏర్పడుతుండటంతోవారు తీవ్రఆర్థిక ఇబ్బందులు గురవుతున్నారు. ఇదిలా ఉండగా జీతాలు చెల్లించకపోవడమే గాక ఉద్యోగ పరంగా వారికి వర్తింపజేయాల్సిన ఈఎస్ఐ ఈపీఎఫ్ తదితర పథకాలు కూడా మంజూరు చేయకపోవడంతో వారు మరింత నష్టాలకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో తమ జీతాలు చెల్లించాలనినెలల తరబడి అడుగుతున్నా సంబంధిత అధికారులు.. ప్రజాప్రతినిధులు ఏ మాత్రం పట్టించు కోకపోవడంతో గత్యంతరం లేని స్థితిలో సత్యసాయి కార్మికులు సమ్మెబాటపట్టడంతో తాగునీటి సరఫరా జరగలేదని పేర్కొన్నారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో రెండు వారాల నుంచి నీటి సరఫరా కాలేదన్నారు.కాగా ఈకార్మికుల సమ్మెతో పూర్తిగా మండల వ్యాప్తంగా నీటి సరఫరా నిలిచిపోయే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సత్యసాయి కార్మికులకు బకాయిపడ్డ ఏడు నెలల జీతాలను ప్రస్తుత ఎన్ డి ఏ ప్రభుత్వం తక్షణమే చెల్లించి తాగునీటి సరఫరాకు ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు శ్రీనివాసులు ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో సత్యసాయి కార్మికులతో కలిసి త్వరలోనే పెద్ద ఎత్తున ముదిగుబ్బ మండలంలో రాస్తారోకో కార్యక్రమం చేపడతామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

మా జీతాలు చెల్లించండి మహా ప్రభో..!

విశాలాంధ్ర-ధర్మవరం: శ్రీ సత్యసాయి వాటర్ వర్క్స్ కార్మికులు గత ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో మా జీతాలు చెల్లించండి అని పట్టణంలోని ఎర్రగుంట వాటర్ వర్క్స్ కార్యాలయం వద్ద సమ్మెను నిర్వహించారు. ఈ సందర్భంగా వాటర్ వర్క్స్ కార్మికులు మాట్లాడుతూ శ్రీ సత్యసాయి జిల్లాలో 521 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని. క్యాడర్ను బట్టి 13 వేల నుండి 20వేల రూపాయల వరకు ఒక నెలకు జీతం ఇవ్వాలని, అలాంటిది ఆరు నెలలు కావస్తున్న మాజీతాల గురించి బోర్డు వారుగానీ అధికారులు గానీ పట్టించుకోక లేకపోవడం చాలా దారుణమని తెలిపారు.

మా కుటుంబాన్ని ఏ విధంగా పోషించుకోవాలో..? అధికారులు, బోర్డు వారు తెలపాలని డిమాండ్ చేశారు. అధికారులకు బోర్డు వరకు తెలిపిన కూడా నిధులు లేవని మా చేతుల్లో ఏమీ లేదని నిస్సహాయతను ప్రకటించడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. మరి అధికారులు బోర్డు వారు గతప్రభుత్వానికి, ఈ ప్రభుత్వమునకు విన్నవించు కోవడం జరిగిందని, వారి ద్వారానే సమస్య పరిష్కారం అవుతుందని తెలపడం చాలా బాధాకరమని తెలిపారు. జిల్లా లోని ప్రజలకు సకాలంలో నీటిని అందిస్తున్న మాపై ఇంత కక్ష ధోరణి ఎందుకు? అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మా జీతాలు వచ్చేంతవరకు మాసమ్మెను ఆపమని వారు హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ కార్మికులు పాల్గొన్నారు.

మాహక్కులు కాల రాస్తే ఎదురు తిరిగి పోరాటం చేస్తాం..!

ఏపీ బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షులు శంకరరావు

విశాలాంధ్ర-ధర్మవరం: మా హక్కులను కాల రాస్తే ఎదురు తిరిగి పోరాటం చేస్తామని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు తెలిపారు. స్థానిక ఎన్జీవో హెూంలో ఏర్పాటు చేసిన బీసీల ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. తొలుత బీసీ సంక్షేమ సంఘం నాయకులు కదిరి గేటు వద్ద నుంచి ఎన్టీఆర్ సర్కిల్, కళాజ్యోతి, కాలేజ్ సర్కిల్ మీదుగా ఎన్జీవో హెూంకు ర్యాలీగా వెళ్లి తమ నినాదాలు హెూరెత్తించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు శంకరావు మాట్లాడుతూ బీసీ నాయకుల బీసీల సమస్యలపై వారు చర్చించడం జరిగిందని తెలిపారు. బలహీన వర్గాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపైన వారి హక్కుల భంగం వాటిల్లకుండా ఏ రాజకీయ పార్టీ అయినా సహాయ సహకారాలు అందిస్తే, స్వాగతిస్తామని తెలిపారు.మరి వారి హక్కులను కాల రాస్తే ఎదురు తిరిగి పోరాటం చేయడానికి అయినా వెనకాడే ప్రసక్తే లేదని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోబిసి సంఘం నాయకురాలు జయశ్రీ,రాష్ట్ర బీసీ ఉద్యోగ సంఘం సెక్రటరీ చింతా నాగరాజు,బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నామాల శంకర్,రజిక వత్తిదారుల సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షులు, సత్యసాయి జిల్లాఅధ్యక్షులు బద్దలాపురం నరసింహులు,వాల్మీకి సంఘం సీనియర్ నాయకులు బోయ రవిచంద్ర, బీసీ సంక్షేమ సంఘం టౌన్ సెక్రెటరీ జంగం, వైస్ ప్రెసిడెంట్ రేగాటిపల్లి రవి, జాయింట్ సెక్రెటరీ తిరుపాల్, బండి వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాఘవేంద్రుడి ఆరాధన మహెూత్సవాలు

విశాలాంధ్ర-ధర్మవరం: స్థానిక ఎస్బిఐ కాలనీలో వెలసిన మంత్రాలయ శ్రీరాఘవేంద్ర స్వామి మఠం వారి ఆలయంలో స్వామివారి 353వ ఆరాధన మహెూత్సవ వేడుకలు ఈనెల 20 నుండి 22వ తేదీ వరకు మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా అర్చకులు, కమిటీ, భక్తాదుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మకర్త పద్మనాభ ఆచారి మాట్లాడుతూ వేడుకల్లో భాగంగా చివరి రోజు స్వామివారికి ఉత్తరాధన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, నిర్మాల్య విసర్జన, విశేష ఫల పంచామృతాభిషేకం, కనక మహా పూజ, రథోత్సవము ప్రత్యేక అలంకరణ మహా మంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ప్రతి సంవత్సరం స్వామివారి ఆరాధన మహెూత్సవాలు భక్తాదులు, దాతలు, కమిటీ సహాయ సహకారాలతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. స్వామివారి అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకోవడం పుణ్యకార్యమని తెలిపారు. ఆలయంలోని మృత్తిక బృందావనమును వివిధ అభిషేకాలతో అర్చకులు వాజీ రాజా ఆచార్ తోపాటు శిష్యబృందం నలుగురు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు నడుమ ప్రత్యేక పూజలను నిర్వహించిన తర్వాత వివిధ రకాల పూలతో, పూలమాలలతో అలంకరించడం జరిగిందని తెలిపారు. మృత్తిక బృందావనాన్ని అర్చకులు శ్రీనివాసులు, సురేష్ ఆచారి వివిధ పూలతో, పూలమాలలతో, తులసి ఆకుల మాలలతో అలంకరించడం జరిగిందని తెలిపారు. సాయంత్రం నృత్య ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకోవడం జరిగింది. బ్రాహ్మణులకు అన్నదాన కార్యక్రమాన్ని తదుపరి ప్రజలకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.కార్యక్రమంలో పూర్ణేష్, ఓంకార్, సురేంద్ర ఆచారి, శ్రీనివాస్-అనంతపురం అర్చకులు, డా. సుబ్బారావు, పోలా ప్రభాకర్తో పాటు కమిటీ సభ్యులు, భక్తాదులు, పట్టణ ప్రముఖులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మృతదేహం లభ్యం

విశాలాంధ్ర-నల్లచెరువు: మండల పరిధిలోని ఉబిచర్ల పంచాయతీ గొర్ల వాండ్లపల్లి గ్రామానికి చెందిన రొద్దం సూర్యనారాయణరెడ్డి గతంలో కనబడుట లేదని కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. గురువారం పాత స్టేషన్ పరిసరాల్లో సూర్యనారాయణ రెడ్డి మృతదేహం లభ్యమైనట్లు బంధువులు సమాచారం ఇవ్వగా ఎస్సై, పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అతిసారా వ్యాధి నిర్మూలనకు కృషి చేయండి

విశాలాంధ్ర-గుడిబండ: మండలంలోని కొంకల్లులో రెండు వారాలుగా అతిసారా వ్యాధితో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సందర్భంగా గురువారం జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ గ్రామాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన వైద్య సిబ్బంది పంచాయతీ సిబ్బందితో మాట్లాడుతూ గ్రామంలో అతిసార వ్యాధితో ప్రజల తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, త్వరగా వ్యాధిని అదుపు చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని తెలిపారు. అలాగే మృతి చెందిన వ్యక్తుల వివరాలను అతిసారా వ్యాధికి నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను అధికారులు అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో డిఎంఅండ్హెచ్వో మంజువాణి, మెడికల్ ఆఫీసర్ శాంతి,ఎంపీడీవో రామారావు, డిప్యూటీ తహసిల్దార్ రాంభూపాల్రెడ్డి, ఈవోఆర్డీ నాగరాజు నాయక్, పంచాయతీ కార్యదర్శి ప్రకాష్, ఆర్డబ్ల్యూసీ హరీష్, పంచాయతీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన సీఐ ఇందిరా

విశాలాంధ్ర-కొత్తచెరువు: కొత్తచెరువు అప్గ్రేడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ ఇందిరా పేర్కొన్నారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ బహిరంగప్రదేశాల్లో మద్యంసేవించే వారిపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటుగా ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఎక్కడ చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా నిఘా ఉంచుతామన్నారు. ప్రజలకు రక్షణ కల్పించడమే పోలీసుల ప్రధాన కర్తవమని, స్టేషనుకు వచ్చే బాధితులకు అండగా ఉంటామని సీఐ తెలిపారు.

ప్రజలకు జవాబుదారీగా పనిచేద్దాం-ఎమ్మెల్యే పల్లె సింధూర

విశాలాంధ్ర-పుట్టపర్తి: గ్రామ సభల ద్వారా ప్రజలకు ప్రజల సమస్యలుపరిష్కరించి,వారికి జవాబుదారీగా పనిచేస్తామని ఎమ్మెల్యే పల్లె సింధూర పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో శుక్రవారం గ్రామాభివృద్ధి పనులు గుర్తించడానికి ప్రభుత్వం పెద్దఎత్తున గ్రామ సభలు సమావేశాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గంలో జరిగిన పలువివాహాలకు హాజరైన సందర్భంగాఎమ్మెల్యే పల్లె సింధూర మీడియాతో మాట్లాడుతూ తానునియోజకవర్గంలోని కొత్తచెరువులో గ్రామసభ, బుక్కపట్నంలో గ్రామసభ, నల్లమాడలో గ్రామ సభ, ఓడీచెరువులో గ్రామసభకు హాజరు అవుతానని ఆమె తెలిపారు. ప్రతిఒక్కరూ ఈ గ్రామ సభలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మాజీ మంత్రి డా. పల్లె రఘునాథ్రెడ్డి మాట్లాడుతూ గత జగన్ పాలనలో చరిత్రలో ఒక్క గ్రామ సభ కూడా నిర్వహించలేకపోయారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని పంచాయతీలను పూర్తిగా నిర్వీర్యం చేశారని చెప్పారు.కేంద్రం నుంచి నేరుగా స్థానిక సంస్థలకు మంజురయ్యే నిధులను కూడా వైసీపీ ప్రభుత్వం పక్కదారి పట్టించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏపీ అభివృద్ధి వైపు ఒకొక్క అడుగు పడుతున్నాయని గుర్తు చేశారు. ఏపిలో పరిశ్రమలు నెలకొల్పడానికి అనేక మంది కంపెనీలు ముందుకు వస్తున్నాయని చెప్పారు. ఈ టీడీపీ కూటమి ప్రభుత్వంలో ఎన్నడూ లేని విధంగా ఒకే రోజు గ్రామ సభలు ఏర్పాటు చేసి అభివృద్ధి పనులు గుర్తించడానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున గ్రామ సభలు సమావేశాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

అనంతరం కదిరి ప్రవేట్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన బండ్రేవు కృష్ణారెడ్డి మనుమరాలు మౌనిక-చరణ్ నిశ్చితార్థం కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లె సింధూరతో పాటు మాజీ మంత్రి డా.పల్లె రఘునాథ్ రెడ్డి, సోదరులు రిటైర్డ్ ప్రిన్సిపాల్స్ పల్లె రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డా.పల్లె చంద్రశేఖర్రెడ్డి, బంధువులు, మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

మహిళ హత్య కేసు ఛేదించిన పోలీస్ అధికారులు

మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన డీఎస్పీలు

విశాలాంధ్ర-హిందూపురం : జిల్లా డీఎస్పీ రత్న ఆదేశాల మేరకు హిందూపురం రూరల్ పోలీస్ స్టేషన్ నందు పెనుగొండ డీఎస్పీ ఆర్ల. శ్రీనివాసులు, హిందూపురం డీఎస్పీకేవీ.మహేష్లు మహిళ హత్య కేసుపై మీడియా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ హిందూపురం సబ్ డివిజన్ పోలీసులు 48 గంటల్లోనే మేకల కాపరి అయిన మహిళ హత్య (మర్డర్ ఫర్ గెయిన్) కేసును ఛేదించామని, నిందితుడిని అరెస్టు చేశామని, ఇతని నుండి 13 మేకలు, ద్విచక్ర వాహనం, సెల్ఫోన్, బొలెరో వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. మేకల కాసేందుకు వెళ్లిన మహిళను చంపి ఆమెకు సంబంధించిన 13 మేకలు బొలెరో ద్వారా సోమందేపల్లి మండలం, ఈదులబల్లాపురం గ్రామం కంబాలప్ప గారి హరి (కథల హరి) ఎత్తుకెళ్లినట్లు పోలీసుల విచారణలో వెల్లడైందని, మీడియా సమావేశంలో డిఎస్పీలు వివరించారు.

ఈ సమావేశంలో హిందూపురం సీఐలు ఆంజనేయులు, కె. జనార్ధన, అబ్దుల్ కరీం, రాజగోపాల్తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ సభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-అగళి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గ్రామసభ లను మండలం లోని అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం నిర్వహించే ఉపాధిహామీ గ్రామ సభలను జయప్రదం చేయాలని జడ్పీటీసీ ఉమేష్, అగళి మండల టీడీపీ అధ్యక్షులు కుమారస్వామి తెలిపారు. ఉపాధిహామీ అధికారులు అనుబంధ శాఖధికారులు హాజరవుతారని, గ్రామాల్లో అవసరమైన పనులు అధికారులు దృష్టికి తీసుకొచ్చి కూలీలకు పనులు కల్పించడం ప్రజలకు అవసరమయే పనుల ఎంపికకు కృషి చేయాలన్నారు. ఈ గ్రామ సభలో ప్రభుత్వం ప్రజలకు పలుఅంశాలపై అవగాహన కల్పిస్తుందని, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించి గ్రామసభల్లో నుంచి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. 2024-25లో చేపట్టే అభివద్ధి పనులపై అధికారులు ప్రజలతో చర్చిస్తారని ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ శ్రేణులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జడ్పీటీసీ ఉమేష్, కన్వీనర్ కుమారస్వామి తెలిపారు.

కలకత్తాలో వైద్య విద్యార్థిపై అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి-సీపీఐ-ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర-హిందూపురం: కలకత్తాలో వైద్య విద్యార్థిపై అత్యాచారం చేసిన నిందితులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేస్తూ స్థానిక రహమత్పురం సర్కిల్ నుండి సద్భవన్ సర్కిల్ వరకు భారీ కొవ్వొత్తుల ర్యాలీని గురువారం చేపట్టారు. ఈసందర్భంగా సీపీఐ హిందూపురం కార్యదర్శి కనిశెట్టిపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ భవిష్యత్తులో మహిళల మీద చేయి వేయాలన్న భయపడేలాగా చట్టాలు చేయాలని, మహిళలకు రక్షణ కల్పించాలని స్వ తంత్రం వచ్చి 78 ఏళ్లు పూర్తి అవుతున్నప్పటికీ మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం చెందుతున్నాయని నిర్భయ, దిశా, ఫోక్సో లాంటి చట్టాలు వచ్చినప్పటికీ మహిళలపై అత్యాచారాలు దాడులు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యులకే రక్షణ లేకపోతే సామాన్య ప్రజలకు ఎలాంటి రక్షణ ఏపాటిదో దీనిని బట్టి అర్థమవుతుందన్నారు. పాలకులు ఇప్పటికైనా మేల్కొని అత్యాచార నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఈసందర్భంగా పేర్కొన్నారు.

ఈ కార్య క్రమంలో ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి బాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్రెడ్డి, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి మారుతిరెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు సమీవుల్లా, కమల్ భాష, జమీర్, సహాయ కార్యదర్శులుసురేష్, ముత్యాలప్ప, సీపీఐ సహా య కార్యదర్శి ఇస్మాయిల్, సీపీఐ నాయకులు గంగాధర్, చాంద్బాషా, కిరణ్, లింగప్ప, ఏపీ మహిళా సమైక్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) మహిళా సంఘం నాయకురాలు సబిరా, అంజినమ్మ, రుక్మిణి, సల్మా, తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాల గోడ పత్రిక విడుదల

విశాలాంధ్ర-హిందూపురం : పట్టణంలోని మున్సిపల్ జేఏసీ ఆఫీస్ నందు ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలు, సెప్టెంబర్ 1, 2, 3 తేదీల్లో విశాఖపట్నంలో జరుగుతున్న జాతీయ సమ్మేళనాల పోస్టర్లు ఏఐటీయూసీ జిల్లావర్కింగ్ ప్రెసిడెంట్ కనిశెట్టిపల్లి వినోద్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ సెప్టెంబర్లో విశాఖపట్నంలో జాతీయ సమ్మేళనాల నిర్వహిస్తారని, 3న కార్మికుల భారీ ప్రదర్శన బహిరంగ సభ విశాఖపట్నం నందు జరుగుతాయని తెలిపారు.ప్రధానంగా కార్మికుల సమస్యల అజెండాగా కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, నాలుగు లేబర్ కోడ్లు లను రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, విశాఖఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, విశాఖ కేంద్రంగా జాతీయ సమ్మేళనాలు ఏఐటీయూసీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చలపతి, ఏఐటీయూసీ పట్టణ ఉపాధ్యక్షులు సురేష్, సమీవుల్లా, సహాయ కార్యదర్శులు నౌషాద్, కమల్బాష, జమీర్, ఏఐటీయూసీ మీటర్ రీడర్స్ జిల్లా కార్యదర్శి షానవాజ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ముద్దాలప్ప, ఈరప్ప, అంజి, వినోద్, సిద్ధమ్మ, లక్ష్మి, ఆటో యూనియన్ నాయకులు ఖలీల్, అన్సార్, జియావుల్లాలు పాల్గొన్నారు.

ఘనంగా జరిగిన దైవ సేవకుల సదస్సు

విశాలాంధ్ర-ధర్మవరం: స్థానిక మార్కెట్ వీధిలోని ఎస్ఐయు చర్చిలో ఘనంగా 2 రోజుల పాటు దైవ సేవకుల సదస్సులునిర్వహించుకున్నారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా తమిళనాడులోని వేలూరు నుండి వచ్చిన దైవ సేవకులు డాక్టర్ దేవ సహాయం వారు వాక్య సందేశములు వివరించారు. ఈ సదస్సుకు నియోజకవర్గ పాస్టర్స్ అధిక సంఖ్యలో పాల్గొని దైవ సేవకుల సదస్సు ప్రాధాన్యతను తెలుసుకున్నారు. ప్రభువు మహిమలను తెలుపుతూ, నిస్వార్థంతో లోకంలో జీవించాలని, పేదలను ప్రేమతో ఆదరించాలని తెలిపారు. అనంతరం చర్చి వారు దేవా సహాయం ని పాస్టర్స్ కమిటీ అధ్యక్షుడు షేక్ మోజస్, ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, కార్యదర్శి సుధాకర్ రెడ్డి ,సహకార దర్శి సోలోమోన్, కోశాధికారి గ్రేసయ్య సీనియర్ దైవ సేవకులు సుందర్ సింగ్ సుకుమార్లను సన్మానించారు.

ముగిసిన ఆరాధన మహెూత్సవ వేడుకలు

విశాలాంధ్ర-ధర్మవరం: బత్తలపల్లి రోడ్డులోని శ్రీ మారుతీ రాఘవేంద్ర స్వామి ఆలయంలో రాఘవేంద్ర స్వామి 38వ ఆరాధన మహెూత్సవ వేడుకలు ఈనెల 20 నుండి 22వ తేదీ వరకు మూడు రోజుల పాటు భక్తులు, ఆలయ కమిటీ, దాతల సహాయ సహకారములతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వేణుగోపాలరావు రాఘవేంద్ర స్వామి బృందావన రాతి ఉత్సవ విగ్రహాన్ని కి వివిధ పూజలతో పాటు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు నడుమ భక్తులు, కమిటీ ఆధ్వర్యంలో విశేష పూజలను నిర్వహించారు. ఉత్తరాన ఆరాధన, గణపతి, కలశ, నవగ్రహపూజ, పల్లకోసం, ఉయ్యాల ఉత్సవం నిర్వహించారు. స్వామివారికి అలంకరించిన పూల అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం సాయంత్రం స్వామివారికి పల్లకోస్తవంకార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించి భక్తాదులకు దర్శనమిచ్చారు.

సాయంత్రం స్వామివారికి స్వస్తి వచనములతో ఉయ్యా లోస్తవం యొక్క కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ మల్లికార్జున, కృష్ణమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు తోపాటు అధిక సంఖ్యలో భక్తాదులు పాల్గొన్నారు.

రైతుల పంటలను ఎఫ్పీవోలకు అమ్మకాలు చేయండి

విశాలాంధ్ర-ధర్మవరం: రైతులు పండించిన పంటలను దళారులకు అమ్మకుండా ఎఫ్పీవోలకు మాత్రమే అమ్మకాలు చేసి మోసం లేకుండా ప్రయోజనం పొందాలని ఏఎఫ్ ఎకాలజీ సంస్థ, ఎఫ్పీవో కోఆర్డినేటర్ శంకర్ నాయక్ తెలిపారు. ఈసందర్భంగా మండల పరిధిలోని పోతుకుంట ఆర్డిటి పాఠశాలలో సంఘం పాలకవర్గ సభ్యులు ఆధ్వర్యంలో సంస్థ సహకారంతో 8వ వార్షిక మహాసభలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ ధర్మవరం రైతు ఉత్పత్తిదారుల సంఘంలో ధర్మవరం పరిధిలోని 22 గ్రామాల నుండి రైతులు 400 మంది సభ్యులుగా ఉన్నారని, వీరందరూ కూడా నేరుగా ఫ్యూలకు మాత్రమే అమ్మకాలు చేయాలని తెలిపారు.తద్వారా రైతులు మోసపోరని, ఎఫ్పీవో నుండి ఏర్పాటు చేసిన రైతుఅంగళ్ల నుండి రైతులకు కావలసిన వ్యవసాయ పనిముట్లు, డ్రిప్పు స్ప్రింకర్లు, తార్పుల్లిను బట్టలు, స్ప్రేయర్లు, దాన, జొన్నలు, ఉలువలు, కందులు, ఆముదం మొదలైన విత్తనాలు మార్కెట్ తక్కువ ధరలకే సంఘంలో సభ్యులుగా ఉన్న రైతులకు అమ్మకాలు చేయడం జరుగుతుందని తెలిపారు.వచ్చిన డబ్బులు వారి రైతు సంఘం ఖాతాలోకి డిపాజిట్ చేసి వారి యొక్క వాటాను పెంచడం జరుగుతుందని తెలిపారు. ఈవిధంగా రైతు సంఘం పనిచేయడం నిజంగా శుభదాయకమని తెలిపారు. కార్యక్రమంలో మండల టీం లీడర్ దస్తగిరి, ఎఫ్పీవో మేనేజర్ ప్రతాప్కుమార్, నంద, సీఈవోలు-నరసింహులు, మోహన్, ఎస్టీవోలు విక్రమ్, ఎర్రి స్వామీ తదితరులు పాల్గొన్నారు.

వైద్యవిద్యార్థి మృతికి కారకులైన వారిని వెంటనే ఉరితీయాలి



విశాలాంధ్ర-ధర్మవరం: కలకత్తాలోని వైద్యవిద్యార్థి మృతికి కారకులైన వారిని వెంటనే ఉరితీయాలనికోరుతూ పద్మావతి మహిళా డిగ్రీకళాశాల విద్యార్థినీలుడిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినిలు పట్టణంలోని పలు కూడలిలో ర్యాలీ చేస్తూ నినాదాలను హెూరెత్తించారు. అనంతరం కాలేజీ విద్యార్థులు మాట్లాడుతూ కల్కత్తాలో శిక్షణా వైద్యురాలుపై కామాంధులు హత్యాచారం చేసి, అత్యంత దారుణంగా హత్యచేయడం దారుణమని మండిపడ్డారు. మహిళల కోసం ఎన్ని చట్టాలు వచ్చినా...ఉపయోగం లేదన్నారు. మన దేశ స్వతంత్రం వచ్చిన రోజునే ఇలాంటి ఘటనలు జరగడం సిగ్గుచేటన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వదిలి నిందితులను వెంటనే శిక్షించి, ఉరిశిక్షపడేలా వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా మృతి చెందిన డాక్టర్ ఆత్మ శాంతి కలగాలని వారు మౌనం పాటించారు. తదనంతరం గాంధీనగర్ లోని గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలేజీ కరస్పాండెంట్ బుగ్గా సాయి, డైరెక్టర్ బుగ్గా జగదీష్, కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున, కళాశాల ఏవో, లెక్చరర్స్ బృందం పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధి పట్ల విద్యార్థులకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణం లోని స్థానిక కె.హెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ యువజన దినోత్సవ సందర్భంగా ఎయిడ్స్ వ్యాధిపట్ల అవగాహన సదస్సు కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్రెడ్డి, ఎన్.ఎస్.ఎస్, మహిళ సాధికారత విభాగం అధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.ప్రభాకర్రెడ్డి అధ్యక్షత వహించారు. విద్యార్థులకు అవగాహన కల్పించడానికి నెహ్రూ యువ కేంద్రం, సంస్థ డైరెక్టర్ భరత్, ఇన్ఛార్జ్ శ్రీనివాసులు ప్రభుత్వాసుపత్రి ఐ.సి.టి.సి. కౌన్సిలర్ అరవింద్, మైత్రిసంఘం ప్రాజెక్టు డైరెక్టర్, రాధమ్మ,ఎస్.ఎం.ఎం.ఎస్. బోర్డు మెంబర్ నారాయణమ్మ , ప్రాజెక్టు మేనేజర్- నవీన్ కుమార్, కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ సురక్షిత లైంగిక సంబంధాలు కలిగి వుండకపోవడం రక్తదానం చేస్తున్నప్పుడు రక్త పరీక్ష చేయకుండా రక్తాన్ని ఎక్కించడం, శుభ్రం చేయకుండా ఇతరులకు వాడిన సూదులు, సిరంజలు వినియోగించడం, వ్యాధిగ్రస్తులు గర్భవతికి కలిగిన సంతానానికి వ్యాధి రావడానికి అవకాశం వుండడం జరిగుతుందని తెలిపారు. కార్యక్రమానికి ఎన్.ఎస్.ఎస్. కో-ఆర్డినేటర్ డా.బి. గోపాల్ నాయక్ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో మహిళా సాధికారత విభాగము కో-ఆర్డినేటర్ డా.ఎస్.చిట్టమ్మ, డా.ఎస్. షమీఉల్లా, బి.గోపాల్ నాయక్, ఎం. భువనేశ్వరి, యం పుష్పావతి, సరస్వతి. తధీతర బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

క్లబ్..ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో..



కలకత్తాలోని వైద్య విద్యార్థిని మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని రోటరీ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్బు వారు మానవ హక్కుల సంరక్షణ సమితి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలుబాలికల పాఠశాలలు, కళాశాలలో వైద్యవిద్యార్థిని మృతికి వివరాలు తెలియజేస్తూ ఆమె మృతికి సంతాపాన్ని తెలిపారు. పట్టణపురవీధుల్లో విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. క్లబ్అధ్యక్షుడు జయసింహ, కార్యదర్శి నాగ భూషణ, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షులు నాగరత్నమ్మలు మాట్లాడుతూ ప్రజలకు ప్రాణాలను నిలుపుదల చేసే వైద్యులపైనే ఇలాంటి కిరాతకమైన చర్యకు పాల్పడటంఅత్యంత బాధాకరమన్నారు. పాలకప్రభుత్వాలు ఇప్పటికైనా రక్షణ, భద్రతలపై ప్రత్యేకమైన కఠిన చట్టాలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

దోమల నివారణకు ఫాగింగ్

విశాలాంధ్ర-గోరంట్ల: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా వైద్య సిబ్బంది-పంచాయతీ సిబ్బంది కలిసి దోమల నివారణకు అవగాహన కార్యక్రమాలతో పాటు ఫాగింగ్ నిర్వహించారు. ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని, దోమతెరలు వాడాలన్నారు. దోమలు లార్వా పెరగకుండా మురికి నీటిని నిలువ ఉంచరాదని ఇళ్లలో కూడా డ్రమ్ముల్లో ఎక్కువ కాలం నీటిని ఉంచకుండా వాడుకోవాలని సలహాలు సూచనలు చేశారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, శుక్రవారం 23, ఆగస్టు 2024

ఏడీసీసీ బ్యాంకులో సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు

విశాలాంధ్ర-గోరంట్ల: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణ విధానంలో ఉన్న సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమంలో భాగంగా గోరంట్ల పట్టణం లోని ఏడీసీసీ బ్యాంకులో సహకార సంఘం సిబ్బంది బ్యాంకు సిబ్బంది నిరసన కార్యక్రమం నిర్వహించి,నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు,కేంద్ర ప్రభుత్వం నిర్ణయంలో భాగంగా నాబార్డ్ వారి సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణ ప్రక్రియ జరుగుతున్నదనీ, ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మరియు ఆంధ్రప్రదేశ్ పి.ఎ.సి.ఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సంయుక్తంగా కంప్యూటరీకరుణ ప్రక్రియను స్వాగతిస్తున్నామన్నారు. కంప్యూటరీకరణ ప్రక్రియలో ఎదుర్కొంటున్న సమస్యలపై సహకార శాఖా మంత్రి కె.అచ్చం నాయుడు కి, ఏపీసీవోబీ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డికి మా సమస్యలు పరిష్కరించాలని కోరడం జరిగిందన్నారు, మా విజ్ఞప్తుల తరువాత సమస్యలు పరిష్కారం కాకపోగా, కంప్యూటరీకరణ ప్రక్రియలో మరింత ఒత్తిడి తీసుకొస్తూ ఉద్యోగులను మానసిక ఆందోళనకు గురిచేస్తూ అనేక ఇబ్బందులు పెట్టటం జరుగుతుందన్నారు,దేశంలో అన్ని రాష్ట్రంలో సహకార సంఘాల కంప్యూటరీకరణ డేటా ఎంట్రీ ప్రక్రియ అనుభవం కలిగిన ఒక ప్రైవేట్ కంపెనీ ద్వారా నిర్వహించడం జరిగింది. కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉద్యోగులకు డేటా ఎంట్రీ విధానంపై కనీస అవగాహన కూడా కల్పించకుండా ఉద్యోగులపై ఒత్తిడి తీసుకువస్తూ ఈ డేటా ఎంట్రీ ప్రక్రియ చేపట్టడం జరుగుతుందన్నారు, రాష్ట్రస్థాయి,జిల్లా స్థాయి, గ్రామస్థాయిలో ఏ ఒక్క అధికారికి లేదా ఉద్యోగికి డేటా ఎంట్రీ ప్రక్రియ పై ప్రాథమిక శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయకుండా, నిర్దిష్టమైన అవగాహన కల్పించకుండా కంప్యూటరీకరణ ప్రక్రియ చేపట్టడం జరుగుతుందన్నారు, ఈ చర్యల కారణంగా భవిష్యత్తులో సహకార సంఘాలు రోజు వారీ లావాదేవీలలో అనేక ఇబ్బందులను ఎదుర్కోవటం తప్పదన్నారు,ప్రైవేటు ఏజెన్సీ ద్వారా డేటా ఎంట్రీ చేపట్టాల్సి వుండగా దానిని మరచి సహకార సంఘ ఉద్యోగులను, సహకార బ్యాంకు ఉద్యోగులను డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా వాడుకుంటూ నిర్దిష్ట సమయంలో ప్రక్రియ పూర్తి కాలేదని మరలా వారి పైనే విపరీతమైన ఒత్తిడి తీసుకువస్తూ సస్పెన్షన్, షోకాజ్ నోటీసు మంజూరు వంటి అనేక చర్యలకు గురి చేయటం జరుగుతుందనీ, రాష్ట్ర స్థాయి సహకార అధికారులు, జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, జిల్లా సహకార శాఖా అధికారులు, సహకార బ్యాంకు అధికారులు, డివిజనల్ సహకార అధికారులు, మండల డెవలప్మెంట్ అధికారులు రివ్యూ ల పేరుతో రోజుకు రెండు నుంచి మూడు రివ్యూ మీటింగు నిర్వహిస్తూ ఎంత పురోగతి ఉన్నది అని చూస్తున్నారే తప్ప రివ్యూ సమావేశాలలో డేటా ఎంట్రీ సమయం ఉద్యోగులు ఎదుర్కొనుచున్న సమస్యలను ఏ ఒక్క అధికారి కూడా నివృత్తి చేయటం లేదన్నారు,డేటా ఎంట్రీ సమయములో భూమి సమాచారం, డిపాజిట్ల సమాచారం, మెంబర్ షిప్ సమాచారం...మొదలైన సమాచారం పొందుపరచే సమయములో అనేక సందేహాలు వున్నవి. ఆసందేహాలు రివ్యూ సమావేశములలో సంభదిత అధికారులను అడగగా కేవలం డేటా ఎంట్రీ పురోగతి తప్ప వేరే విషయము చర్చించవద్దు అని నిర్మొహమాటంగా తెలియచేస్తున్నారు. ఎందుకనగా వారికి కూడా ఎలాంటి శిక్షణా అందించలేదన్నారు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కంప్యూటరేకరణ ప్రక్రియ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో జరుగుతున్నప్పటికీ ఇప్పటివరకు చాలా సంఘాల్లో కంప్యూటర్లు లేవు. ఉద్యోగులు ఇంటర్నెట్ సెంటర్ల ద్వారా, జిల్లా సహకార బ్యాంకులలో ఉన్న కంప్యూటర్లను ఉపయోగిస్తూ డేటా ఎంట్రీ చేయడం జరుగుతుంది అదే కాకుండా కొన్ని సంఘాలలో ఉండే ఒకే ఒక్క కంప్యూటర్ ద్వారా సంఘం మొత్తం సమాచారాన్ని తయారు చేసి అప్లోడ్ చేయడం చాలా కష్టంగా ఉన్నది. ప్రతి సంఘానికీ మూడు నుంచి నాలుగు కంప్యూటర్లు అందించవలసి ఉన్నదన్నారు,ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణ ప్రక్రియ నిమిత్తం సహకార బ్యాంకుల్లో , సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రతిరోజు అర్ధరాత్రి వరకు పనిచేయడం జరుగుతుంది. కెపాసిటీ తక్కువగా ఉన్న సర్వర్ సరిగా పని చేయకపోవటం వలన డేటా ఎంట్రీ అంతరాయాలు కారణంగా పని చాలా ఆలస్యంగా జరుగుతున్నది. అనేక సందర్భాల్లో గంటల తరబడి కష్టపడి పొందుపరచిన సమాచారం టెక్నికల్ కారణాలు చూపిస్తూ కంప్యూటర్ రిజెక్ట్ చేయడం జరుగుతుంది. వీటినేమీ పరిగణలోకి తీసుకోకుండా డేటా ఎంట్రీ లో పురోగతి లేదని ఉద్యోగులను పరుష పదజాలంతో తిట్టడం జరుగుతుందన్నారు. ఇవే కాకుండా అనేక అంశాలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, దానిలో పనిచేస్తున్న ఉద్యోగులు కంప్యూటరీకరణ ప్రక్రియలో అనేక ఇబ్బందులను ఎదుర్కొనడం జరుగుతుందన్నారు, మానసిక ఒత్తిడి కారణంగా కొందరు ఉద్యోగులు అనారోగ్యానికి గురై ఆసుపత్రి నందు చికిత్స పొందుతున్నారనీ,మేము కంప్యూటరీకరుణ ప్రక్రియకు వ్యతిరేకం కాదు.. కానీ సమయంతో సంబంధం లేకుండా, ప్రక్రియలో ఉన్న లోపాలను సరి చేయకుండా, తప్పులతో ఉన్న సమాచారాన్ని కంప్యూటర్లో పొందుపరుస్తూ జరుగుతున్న ఈ ప్రక్రియ వల్ల భవిష్యత్తులో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ ఆంధ్రప్రదేశ్ కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మరియు ఆంధ్రప్రదేశ్ పిఎసిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సంయుక్తంగా రాష్ట్రవ్యాప్త ఆందోళన కార్యక్రమానికి పిలవడం జరిగిందన్నారు, 23 న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరైజేషన్ సంబంధిత ఏ కార్యక్రమములో కూడా పాల్గొనకుండా పెన్ డౌన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

విద్యార్థులు దేశ నాయకులను ఆదర్శంగా తీసుకోండి

విశాలాంధ్ర-కొత్తచెరువు: విద్యార్థులు దేశ నాయకులను స్వాతంత్ర

సమరయోధులను ఆదర్శంగా తీసు కొని వారి అడుగు జాడల్లో నడవాలని కొత్తచెరువు ఆఫ్ గ్రేడ్ సీఐ ఎంపీ ఇందిర తెలిపారు. ఉజ్వల భారత్ కార్యక్రమంలో భాగంగా శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు భారీ ర్యాలీ నాలుగు రోడ్ల కూడలిలో నిర్వహించి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలాంటి స్వార్థం లేకుండా దేశ స్వతంత్రం కోసం ఎంతోమంది నాయకులు పోరాడి వారి ప్రాణాలను కూడా అంకితం చేశారన్నారు. ఎంతోమంది ప్రాణ త్యాగంతోనే దేశానికి స్వతంత్రం వచ్చిందన్నారు. విద్యార్థులు ఆ దేశ నాయకుల వేషధారణలో ర్యాలీలో పాల్గొనడం ఎంతో హర్షించదగ్గ విషయం అన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని వివిధ రంగాల్లో దేశ అభివృద్ధి కోసం కృషి చేయాలి అన్నారు. ప్రపంచ దేశాల్లోనే భారతదేశానికి ఒక ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. అన్ని రంగాల్లోనూ విద్యార్థులు రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవీన్ కుమార్ రెడ్డి, డ్రీం హనుమంతు, ఏవో కేశవరెడ్డి, నరేంద్ర ,సుధా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యంతోనే అతిసారా వ్యాధికి కారణం

విశాలాంధ్ర-రొళ్ల: గత వైసిపి ప్రభుత్వం పాలకుల నిర్లక్ష్యం వల్ల మడకశిర నియోజకవర్గం వ్యాప్తంగా గ్రామాలలో స్వచ్ఛత పరిశుభ్రత కార్యక్రమం చేయకుండా తాగునీటి పైపులైన్ల మరమ్మత్తు చేయకుండా తాగునీటి ట్యాంకర్లను శుభ్రపరచకుండా నిద్రమత్తులో ఉండడం వల్లనే ఈరోజు కొంకల్లు ఎం రాయపురం గ్రామాల్లో అతిసార వ్యాధికి కారణమని మడకశిర శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎం.రాయపురం గ్రామంలో అతిసార వ్యాధితో బాధపడుతున్న వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం నాయకులు దోచుకొని దాచుకోవడంలో బిజీగా ఉండి ప్రజల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించడం శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం లో ప్రజలకు తాగునీరు సౌకర్యం కల్పించకుండా కేవలం నిధుల స్వాహా కోసమే శ్రీరామిరెడ్డి తాగునీటి ప్రాజెక్టును నడపడం వల్ల ఇప్పుడు ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని, ఇది గమనించకుండా ఒక దినపత్రికలో అసత్యారోపణలు వాళ్ళ మనస్సాక్షిని చంపుకొని రాయడం హేయమైన చర్యాని మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఖండించారు. ప్రస్తుతం నూతనంగా కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో మడకశిర నియోజకవర్గ ప్రాంత ప్రజలకు అండగా ఉంటూ భవిష్యత్తులో ఇలాంటి పరిణామాలు ఎదురు కాకుండా ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపే విధంగా ప్రభుత్వ అన్ని శాఖల సమన్వయం చేసుకొని ముందుకు వెళతామని తెలిపారు. బాధిత కుటుంబాలకు మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు తన ఉదార మనసుతో తన వంతు 20 వేలు దాదాపు 9 కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు కల్పిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ ఓ సెల్వియా, ఎంపీడీవో ఆజాద్, ఇంచార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, వైద్యాధికారిణి సౌందర్య, ఏవో ప్రసాద్, ఎస్సై రాజశేఖర్, తెదేపా మండల అధ్యక్షులు దాసిరెడ్డి, మద్దనకుంటప్ప టి.ఎన్.టి.యు.సి రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, ఒక్కలిగా సాధికార కన్వీనర్ వి.యం పాండురంగప్ప, మాజీ జెడ్పిటిసి సన్నతిమ్మప్ప, భాజపా సీనియర్ నాయకులు ఎం.ముద్దరాజు, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొంకల్లు డాక్టర్.కృష్ణమూర్తి తెదేపా మండల ప్రధాన కార్యదర్శి జి.కె ఈరన్న,మాజీ వైస్ ఎంపీపీ సిద్దగంగప్ప,క్లస్టర్ ఇంచార్జ్ హెుట్టేబెట్ట భరత్ నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, తెదేపా మండల బీసీ సెల్ అధ్యక్షులు దాసప్పపాళ్యం నాగరాజు, మాజీ సర్పంచ్ పాండురంగప్ప, పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్, రచన విఆర్ఓ నాగరాజు, తెదేపా, జనసేన, బిజెపి నాయకులు గొట్టుగురికి శ్రీనివాస్, రవికుమార్, దొడ్డేరి ఉమేష్, నాగేష్, మూర్తి పాల్గొన్నారు.

కియా సంస్థ సామాజిక బాధ్యత కింద పండ్ల మొక్కల పెంపకం అంగన్వాడీల నిర్మాణం

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ మండల పరిధిలోని మునుమడుగు గ్రామ పంచాయతీ నందు గురువారం కియా సంస్థ ప్రతినిధులు అయినా కబ్డాంగ్‌లి ఆధ్వర్యంలో కమ్యూనిటీ సామాజిక బాధ్యత కింద గ్రామమునందు పండ్ల మొక్కలు పెంచడానికి, మరియు గ్రామంలో మోడల్ అంగన్వాడి కేంద్రాన్ని నిర్మించడానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో పండ్ల మొక్కల యొక్క పెంపకం, ఇంటిగ్రేటెడ్ విలేజ్ డెవలప్మెంట్, గ్రీన్ ఫారెస్ట్ ప్రాజెక్టు కింద 37 ఎకరాలలో ఈ పండ్ల మొక్కలను పెంచుతున్నామని, వాటిలో జామ మొక్కలు 460, జామున్ మొక్కలు 330, మామిడి 1726 పెంచడానికి సామాజిక బాధ్యత కింద రైతులకు సహాయం చేస్తున్నామని తెలిపారు. అంగన్వాడీ కేంద్ర నిర్మాణం వలన శిశువులు, కౌమార బాలికలు, గర్భిణీ తల్లులు, మరియు రైతులతో సహా విభిన్న కమిటీ విభాగాలకు ప్రయోజనం చేకూర్చటానికి ఈ కార్యక్రమాల రూపొందించామని కమ్యూనిటీ కేంద్రీకృత ప్రయత్నాలతో పాటు కియా ఇండియా వారి యొక్క హరిత కార్యక్రమాల ద్వారా పర్యావరణ సుస్థిరితను కూడా ప్రోత్సహిస్తుందని వారు తెలిపారు. అలాగే ఈ కియా సంస్థ మండల పరిధిలోని బోజ్జి రెడ్డిపల్లి, దుద్దే బండ, మరియు మునిమడుగు, గ్రామాలలో మూడు మోడల్ అంగన్వాడీ కేంద్రాలను నిర్మిస్తుందని సురక్షితమైన వాతావరణాన్ని అందిస్తాయని సమగ్ర పిల్లలు, మరియు తల్లి సంరక్షణ, మద్దతు రూపొందించబడ్డాయి. ఈ పండ్ల మొక్కల వలన పెనుకొండ మండలం సికేపల్లి మండలాలలో 20 గ్రామాలలో దాదాపుగా 600 మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. వాతావరణంలో మార్పులను ఎదుర్కోవడం జీవవైవిధ్యాన్ని పెంపొందించడంలో మరియు నేల ఆరోగ్యాన్ని మెరుగువరచడంలో పండ్ల చెట్ల పెంపకం కీలకపాత్ర పోషిస్తుందని, 40 వేల పండ్ల మొక్కలను సి ఎస్ ఆర్ ద్వారా స్థానిక రైతులకు ఆ దనపు ఆదాయ వనరులను అందించాలని, లక్ష్యంగా పెట్టుకుందని ఆ సమయంలో పర్యావరణ సుస్థిరతకు మద్దతు ఇస్తుంది స్థానిక వర్గాలకు ప్రత్యేకమైన జీవన ఉపాధిని కల్పించడంతో చెట్ల సహాయపడతాయని వారికోసం ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అశ్వర్థ నారాయణ, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు శ్రీనివాసులు, సిడిపిఓ శాంత లక్ష్మి, ఐసిడిఎస్ అధికారులు కియా సంస్థ ప్రతినిధులు, అధికారులు అనధికారులు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

న్యాయవాది నాగరాజును అభినందించిన వైయస్ జగన్

విశాలాంధ్ర-పెనుకొండ: తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం వైసీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులతో సమావేశమైన మాజీ ముఖ్యమంత్రి వర్యులు వైయస్ జగన్మోహన్‌రెడ్డి సమావేశానికి రాష్ట్ర నలమూలల నుండి 26 జిల్లాల అధ్యక్షులు మరియు రాష్ట్ర వైసీపీ కమిటీ పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్ర వైసీపీ జాయింట్ సెక్రెటరీ పెనుకొండకు చెందిన లాయర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సమావేశ అనంతరం వైయస్ జగన్మోహన్‌రెడ్డి గత సంవత్సరం జులై లో న్యాయవాది నాగరాజు ముఖ్యమంత్రి యువ న్యాయవాదులకు ఇస్తున్న లానేస్తంపై సమావేశం జరిపిన లా నేస్తం సభ ను జరిపిన తీరు అభినంద నీయము అని ప్రత్యేకంగా నాగరాజు నాగరాజు అభినందనలతో ముంచారు. రాష్ట్రంలో వైఎస్ఆర్సిపి చేస్తున్న సేవా కార్యక్రమాలను ఇతర ప్రాంతాలకు తెలియజేయడానికి మన యొక్క పార్టీ కార్యక్రమాలను అభివృద్ధి పరచటానికి చేస్తున్న ప్రగతిని వివరించడానికి ఇటువంటి యువ న్యాయవాదులు చేస్తున్న కృషి నీ హర్షధ్వనాల మధ్య అభినందించారు.

పంట పొలాలను పరిశీలించిన వ్యవసాయ అధికారి

విశాలాంధ్ర-ఉరవకొండ : మండల పరిధి లోని కోనాపురం, పెన్నోబిలం, షేక్షాన్ పల్లి గ్రామాల్లో రైతులు సాగుచేసిన వేరు శనగ, కందిపొలాలను మండల వ్యవసాయాధికారి శుభకర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పొలాల్లో అంతర సేద్యం చేస్తున్నరైతులతో ఆయన ముఖాముఖి మాట్లాడుతూ అధిక వర్షపాతం నమోదు అయినందున పైరుకు 19.19.19 లేదా పొటాషియం నైట్రేట్‌ను 5 గ్రాములు ఒక లీటర్ నీటికి పిచికారి చేసుకున్నచో పైరు ఆరోగ్యవంతంగా పెరుగుతుందని తెలిపారు , 50 రోజులు పైరుదశలో ఉన్న వేరుశనగకు పంటకు ఎకరాకు 200 కేజీల జిప్సం ను చల్లుకుంటే కాయ నాణ్యంగా ఉంటుందని తెలిపారు. పంటలకు పిచికారి చేసే రైతులు జాగ్రత్తలు తీసుకోకపోతే శ్వాస సంబంధిత వ్యాధులు చర్మ సంబంధ వ్యాధులు వస్తాయని చేతి తొడుగులు,మాస్కు వాడాలని రైతు కు తెలిపారు. రైతులు తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాల్లో పంటలను నమోదు చేసుకోవాలని ఈ కేవైసీ కూడా పూర్తి చేసుకోవాలని తెలిపారు. నమోదైన పంటలకే పరిహారం, బీమా సౌకర్యం వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్కే సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-యాడికి: మండల పరిధిలోని రాయల చెరువు గ్రామంలో లయన్స్

క్లబ్ కార్యాలయం లో గురువారం శంకరా కంటి ఆసుపత్రి బెంగ ళూరు వారి సహ కారంతో రాయల చెరువు లయన్స్ లియో క్లబ్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్ల మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ముందుగా క్లబ్ అధ్యక్షులు చల్లా సూర్యనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ.. ప్రతి నెల మా లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఉచిత కంటి ఆపరేషన్ల మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించడం నిజంగా చాలా సంతోషంగా ఉందని, ఎంతోమంది నిరుపేదలు ఈ శిబిరం ద్వారా కంటి ఆపరేషన్లు చేయించుకుని వారి వారి పనులు చేసుకుంటూ ఒకరిపై ఆధారపడకుండా జీవిస్తున్నామని,ఇంతటి గొప్ప సేవలను మాకు అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపు తున్నందుకు చాలా సంతోషంగా ఉంటుందని తెలిపారు. .ఈ వైద్య శిబిరానికి మొత్తం 176 మంది హాజరవగా అందులో 47 మంది ఆపరేషన్ల కు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో లయన్ రవి ప్రసాద్, జోన్ చైర్మన్ రవికుమార్ రెడ్డి,రంజిత్ కుమార్,ఇస్మాయిల్, కుల శేకర్ నాయుడు,జయరామిరెడ్డి, అల్లా బకాష్, మురళీకృష్ణ, శేషానంద రెడ్డి, రామ మోహన్ రెడ్డి, ప్రసాద్, సెక్రటరీ వికాస్ స్కూల్ రామకృష్ణ మరియు శంకర కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రూరల్ సీఐగా భాధ్యతలు చేపట్టిన పి.నాగేంద్ర

విశాలాంధ్ర-కదిరి: కదిరి రూరల్ సీఐగా పి. నాగేంద్ర భాద్యతలు చేపట్టారు. బదిలీలలో భాగంగా అన్న మయ్య జిల్లా రాయచోటి మహిళా పోలీస్ స్టేషన్ నుండి ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేసి న్యాయం పొందాలన్నారు. శాంతిభద్రతల కు విగాథం కలగకుండా సేవలు అందిస్థానని, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేస్తానని తెలిపారు. ప్రయాణ సమయంలో వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి వాహనానికి సంభందించిన పత్రాలు కలిగి వుండి తమ గమ్య స్థానాలకు చేరుకోవాలన్నారు.

మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ పట్టణం లోని తెదేపా పట్టణ కార్యాలయం నందు పెనుకొండ పట్టణ జనసేన నాయకులు శబరీష్, సాయి శిరీష్ శ్రీదేవి, ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్నా క్యాంటీన్ లో ప్రజలకు స్వీట్లు పంపిణీ చేసే, అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచి చిరంజీవి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా పట్టణ పార్టీ అధ్యక్షులు శ్రీరాములు, మహిళా అధ్యక్షురాలు రమణమ్మ , తెదేపా నాయకులు, జనసేన నాయకులు, చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

కదిరి: మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకొని జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ బైరవ ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం జనసేన పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి పలువురికి పంచి పెట్టారు.సినీ పరిశ్రమలో తన కంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకొని అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కాయల చలపతి, ఉపాధ్యక్షలు పులగం పల్లి రాజా, రవి, కిన్నెర మహేష్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణదారుడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి-సీఐ డివి.నారాయణ రెడ్డి

విశాలాంధ్ర-కదిరి: పట్టణము లోని ప్రధాన రహదారులలోని అన్ని రకాల దుకాణదారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పట్టణ సీఐ డివి నారాయణ రెడ్డి పేర్కొన్నారు.పట్టణంలో ట్రాఫిక్, పార్కింగ్,సీసీ కెమెరాల ఏర్పాటు విషయంపై కోనేరు సమీపాన ఎస్ వి కే ఫంక్షన్ హాల్లో జరిగే సమావేశానికి అన్ని రకాల షాపుల యజమానులు,మేనేజర్లు హాజరుకావాలని ఆయన ఆదేశించారు.

ఇసుక కార్యకలాపాలు సమర్థవంతంగా అమలు చేయాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

విశాలాంధ్ర-అనంతపురం: జిల్లాలో ఉచిత ఇసుక కార్యకలాపాలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఎ.ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఉచిత ఇసుక కార్యకలాపాల అమలుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఇచ్చిన ఆదేశాల మేరకు మైన్స్, ఇతర శాఖల జిల్లా అధికారులకు జిల్లా కలెక్టర్ పలు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండల ప్రత్యేక అధికారులు ఇసుక రీచ్‌లను, స్టాక్ పాయింట్లను తనిఖీ చేయాలని మరియు జిల్లాలో ఇసుక అమలును మెరుగుపరచాలన్నారు. తాడిపత్రి మండల పరిమితుల్లో గుర్తించిన 620 మెట్రిక్ టన్నుల అక్రమ నిల్వలపై చర్య తీసుకున్న నివేదికను సమర్పించాలని డి.ఎం.జి.ఓని ఆదేశించారు. ఇసుక బుకింగ్ కోసం రాయదుర్గం తహశీల్దార్ కార్యాలయంలో ఒక అధికారిని బాధ్యులను నియమించి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. నియమించబడిన సిబ్బంది వినియోగదారుల నుండి డిజిటల్ పద్ధతిలో ఇసుక విక్రయ ధరలను సేకరించాలని, స్టాక్ యార్డ్ వద్ద ట్రక్కులలోకి లోడ్ చేయబోయే తేదీ మరియు సమయాన్ని సరిగ్గా పేర్కొంటూ బుకింగ్ రశీదును జారీ చేయాలన్నారు. జిల్లాలోని ఇసుక రవాణాదారులందరితో సమావేశం నిర్వహించాలని, ప్రతి కేటగిరీ వాహనంపై కిలో మీటరుకు, మెట్రిక్ టన్నుకు రవాణా ఛార్జీలను ఖరారు చేయాలన్నారు. ఇసుక రవాణా చేసే వాహనాలను కమిషనర్ మరియు మైన్స్ అండ్ జియాలజీ పోర్టల్ నమోదు చేయాలన్నారు. ప్రత్యేక స్టాక్ యార్డ్ లో ఇసుక కార్యకలాపాలకు మొత్తం ఇంచార్జి గా సంబంధించిన తహశీల్దార్ ఉండాలన్నారు. ఇసుక రవాణాకు సంబంధించి రవాణాదారులు ఎలాంటి ఉల్లంఘనలు చేసినా అన్ని సంబంధిత శాఖలు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. స్టాక్ యార్డు వద్ద ఎటువంటి వాహనం అనవసరంగా వేచి ఉండకుండా చూడాలన్నారు. ఇసుక కార్యకలాపాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా పర్యవేక్షించేందుకు స్టాక్ యార్డులకు సమీపంలో రెవెన్యూ, పోలీస్,పంచాయతీలతో కూడిన చెక్ పోస్ట్ పాయింట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఇసుక సరఫరాకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించడానికి, ఫిర్యాదులను స్వీకరించడానికి టోల్ ఫ్రీ నంబర్ : 08554-298380 ఏర్పాటు చేయడం జరిగిందని, టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదులు తెలుపవచ్చన్నారు. అందిన ఫిర్యాదులను 24 గంటలలోపు పరిష్కరించాలని, ప్రతికూల వార్తలపై నివేదికలను సమర్పించాలన్నారు. జిల్లాలో ఇసుక కార్యకలాపాలకు జాయింట్ కలెక్టర్ నోడల్ అధికారిగా ఉంటారన్నారు. ఇసుక కార్యకలాపాల సంతృప్తి స్థాయిల గురించి విచారించడానికి జాయింట్ కలెక్టర్ వినియోగదారులకు ఫోన్ చేసి తెలుసుకోవాలన్నారు. జేసీబీ ఎక్స్‌కవేటర్స్ కార్యకలాపాలకు ఇంఛార్జ్ గా సంబంధిత ఎంపిడిఓ ఉంటారని, స్టాక్ యార్డ్ వద్ద ఇసుకను లోడ్ చేసే ఏజెన్సీ అవసరాన్ని బట్టి జె సి బి, ఎక్స్‌కవేటర్ల సంఖ్యను మెరుగుపరచాలన్నారు. జుంజురాంపల్లి ఇసుక రీచ్ వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులు మరియు సిబ్బందితో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని అక్రమ ఇసుక తరలింపునకు అవకాశం ఉన్న ప్రాంతాలలో పోలీస్ డిపార్ట్‌మెంట్ బీట్ పాయింట్లను కేటాయించాలన్నారు. జిల్లాలో సమర్థవంతంగా ఉచిత ఇసుక కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఎంపీ పార్థసారథిని కలిసిన డీఎస్పీ శ్రీనివాసులు

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ పట్టణము నందు గురువారం హిందూపురం పార్లమెంట్ సభ్యులు వారి కార్యాలయం నందు పార్లమెంటు సభ్యులు పార్థసారధిని మర్యాదపూర్వకంగా పెనుకొండ డిఎస్పి శ్రీనివాసులు కలసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. అలాగే డివిజన్ పరిధిలో పోలీస్ వ్యవస్థను పటిష్ట పరచి శాంతి భద్రతలు కాపాడాల్సిన అవసరం ఉందని పార్థసారథి డిఎస్పి కి సూచించినట్లు తెలిపారు. అలాగే పార్లమెంటు సభ్యుని కార్యాలయం నందు సోమందేపల్లి మండలానికి నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన రమేష్ బాబు పార్థసారధిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛని అందజేశారు. వారితోపాటు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.